# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 07 -01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రోజు ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు.
2. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.
3. తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాల్లో 13 బిల్లులకు సభ ఆమోదం తెలిపిందని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు.
4. అమరావతిలో నిర్మాణాల కోసం ఈరోజు నుంచి రెండవదశ భూసమీకరణ చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.

..............................

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రోజు ఏలూరు జిల్లాలో పర్యటిస్తారు. ఇందులో భాగంగా ఈ ఉదయం అమరావతి నుండి హెలికాప్టర్ ద్వారా ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతానికి చేరుకుంటారు. అక్కడ ప్రాజెక్ట్ లోని కాఫర్ డ్యామ్, గ్యాప్ 1, గ్యాప్ 2, కుడి కాలువ పనుల ప్రగతిని పరిశీలిస్తారు. అలాగే నిర్మాణం చివరి దశకు చేరుకున్న డయాఫ్రమ్ వాల్‌ను కూడా పరిశీలించనున్నారు. అనంతరం అధికారులతో పోలవరం నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తారని, తర్వాత పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

..............................

మహిళా స్వయం సహాయక సంఘాలకు సుస్థిరాదాయం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సచివాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం-సెర్ప్, పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలన సంస్థ -మెప్మా విభాగాలపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, సహాయక సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు బ్రాండింగ్ చేయాలన్నారు. విభిన్నంగా బ్రాండింగ్ చేయడం ద్వారా వాటికి మరింత విలువ పెరుగుతుందని సూచించారు.

అనంతరం ఈ నెల 2వ తేదీ నుంచి మొదలైన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీపై రెవిన్యూ శాఖ అధికారులతోనూ ముఖ్యమంత్రి సమీక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో ఆయా రైతుల నుంచి భూ

వివరాలు నిర్ధారించుకున్న తర్వాతే కొత్త పాస్ పుస్తకాలను ముద్రించాలన్నారు. భవిష్యత్తులో రెవెన్యూ శాఖ ప్రమేయం లేకుండానే రైతులు వారికి అవసరమైన పాస్ పుస్తకాలను ఆన్ లైన్ లో పొందే విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

.................................

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా నారాకోడూరులో 50 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్లో అదనపు వసతుల కోసం స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కేంద్ర మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

-----------------------

తెలంగాణ శాసనసభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. మొత్తం ఐదురోజుల పాటు శీతకాల సమావేశాలు జరిగాయన్నారు. శాసన సభలో వివిధ అంశాలపై మొత్తం 40 గంటల 40 నిమిషాల పాటు చర్చ జరిగిందని పేర్కొన్నారు. కృష్ణా జలాలు, హిల్ట్ పాలసీ, మూసీ సుందీకరణ, ఉపాధి హామీ పథకం పేరు మార్పు తదితర అంశాలపై సభ్యులు చర్చించారని ఈ సమావేశాల్లో 13 బిల్లులకు సభ ఆమోదం తెలిపిందని చెప్పారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత శాఖల

మంత్రులు సమాధానాలు ఇచ్చారని సభలో 66 మంది సభ్యులు ప్రసంగించారని ప్రకటించారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లో పర్యటిస్తున్న మారిషస్ దేశాధ్యక్షులు ధరంబీర్ గోకుల్ తిరుపతి, తిరుమల పర్యటన నిమిత్తం నిన్న సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా మారిషస్ అధ్యక్షుడు తిరుమల వెంకటేశ్వర స్వామి వారిని దర్శనం చేసుకోనున్నారు. అలాగే నిన్న తిరుచానూరు, శ్రీకాళహస్తి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో చేపట్టనున్న నిర్మాణాల కోసం ఈరోజు నుంచి రెండవదశ భూసమీకరణ చేపడుతున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ- సీఆర్డీఏ సమావేశ వివరాలను మంత్రి నిన్న పాత్రికేయులకు వివరించారు. రాజధాని ప్రాంతంలోని యండ్రాయి, వడ్డమాను గ్రామాల్లో ఈరోజు నుండి ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ మొదలు పెడుతున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..25సెకన్లు

-----------------------

సామాజిక మాధ్యమాల్లో విద్వేష పూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. "సోషల్ మీడియా జవాబుదారీతనం, పౌరుల రక్షణను బలోపేతం చేయడం" అనే అంశంపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేష్ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ... కృత్రిమ మేధ ఆధారిత డీప్ ఫేక్ అశ్లీల సమాచారాన్ని అరికట్టాలన్నారు. మహిళలపై అసభ్య పోస్టులు పెట్టే వారిపై నిఘా పెట్టాలని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ గ్రామంలో గ్యాస్ లీకేజ్ కారణంగా సంభవించిన మంటలు అదుపులోకి వస్తున్నాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. గ్యాస్ లీకేజీ సందర్భంగా చేపట్టిన మంటల నియంత్రణ చర్యలపై అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో నిన్న పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

-----------------------

కాకతీయుల ఓరుగల్లు కోటలో అక్రమ కట్టడాలను తొలగించే చర్యలు చేపట్టాలని

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డికి నిన్న లేఖ రాశారు. చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక వైభవంతో వరంగల్ పట్టణం, వారసత్వ సంపదకు నిలయంగా నిలుస్తోందన్నారు. 7 ప్రాకారాలతో వరంగల్ కోటను ఎంతో గొప్పగా కాకతీయులు నిర్మించారన్నారు.

-----------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం.. అదే ప్రాంతంలో కొనసాగుతోందని, ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదిలి నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న రెండు, మూడు రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని, దట్టమైన పొగమంచు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి తెలిపారు. అలాగే కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదులో గణనీయమైన మార్పులు ఉండవని పేర్కొన్నారు.

==================